నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

ఉక్తలేఖనములు, విస్తార పఠనముల్,
వ్యాసరచనలు న్నుపన్యాసములునైన
పాఠశాలలందు పాటించుచుండగా
బాలబాలికలకు భాష వృద్ధి

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక 20 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | జూలై 19, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# ’విక్రమ్-1’ప్రయోగం విజయవంతం





భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

స్కైరూట్ ఏరోస్పేస్ ’విక్రమ్-1’ రాకెట్ ప్రయోగం విజయవంతం

తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం

అరగంటలోపే సరిదిద్ది పూర్తి చేసిన షార్

ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం

ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

2లో.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన



72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించిన కేంద్రం

ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా యామి గౌతమ్

తెలుగులో పలు విభాగాల్లో సత్తా చాటిన ‘పుష్ప 2‘, ‘ఖల్కి‘, ‘కమిటీ కుర్రోళ్లు‘

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా ‘ఆర్టికల్ 370‘, ఉత్తమ వినోదాత్మక చిత్రంగా ‘ఖల్కి‘

ఉత్తమ దర్శకుడిగా ‘అమరన్‘ చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి



**న్యూఢిల్లీ,జూలై 18 :** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ’కమిటీ కుర్రోళ్ళు’ ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ మిగతా 2లో...

# గోదావరిలో విషాదం..

## చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి



చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

పోలవరం జిల్లా ఎటపాక లో విషాదకర ఘటన

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు

ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్

**పోలవరం జూలై 18 :** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మిగతా 2లో...

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

## బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ

కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా

ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి

తెలంగాణలో లూటీ జరుగుతోంది

మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది

చాయ్ పే చర్చాను మరచిన రాహుల్


**హైదరాబాద్,జూలై 18 :** ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది

మిగతా 2లో...

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం

సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స



2లో.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం



ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు

ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం

సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు

వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన

అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన

ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,జూలై 18 :** ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు.

మిగతా 2లో...

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్‌జూలై 18 :** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

# అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్




దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ -వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు

నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల -నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు

అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

**హైదరాబాద్,జూలై 18 :** దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో ’అందెశ్రీ స్మృతివనం’ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు మిగతా 2లో...

# అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్

మొదటిపేజీ తరువాయి

ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు



సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు

నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

మొదటిపేజీ తరువాయి

ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట,జూలై 18**

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు.

ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

మొదటిపేజీ తరువాయి

నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

# గోదావరిలో విషాదం..

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

## హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం

## సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స

**న్యూఢిల్లీ,జూలై 18,** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శపోలీసులు బలవంతంగా శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన వైద్యసహాయం అందించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించా లని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నామని ఢిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు అని మీడియాతో మాట్లాడారు.

### వాంగ్‌చుక్ తరలింపుతో దీక్షకు దిగిన దీప్కే

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత ఢిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

మొదటిపేజీ తరువాయి

అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక



హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు

బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే



ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో

# నీలగిరి సాహితీ సంగమం -14

## తొలిపూజలందుకో

సీసం!
ఏకదంతుని గొల్వ నేకమై రారండి
సద్భక్తి తోడను సత్వరముగ!!
గణనాథు బూజించ గష్టాలనెల్లను
జీర్ణమ్ము సేయును శీఘ్రముగను!!
బొజ్జ గణపతిని బుద్ధిగా వేడినన్
బూర్ణాయువు నొసగు ముదముగాను!!
మూషికవాహనున్ మోక్షమ్ము గోరిన
తక్షణమ్మే యిచ్చు తండ్రివోలె!!
తేటగీతి
వెలగపండు బత్రమ్ములు గలువ పూలు
గరికపోచ యుండ్రాళ్ళను బెరుగు నెయ్యి
మామిడాకులు గలశమ్ము గామితముగ
పసుపు కుంకుమలను దెండు భక్తితోడ!

**గడ్డం కృష్ణారెడ్డి.రేపాల**
**సూర్యాపేట!!**

## వేణుగోపాల విన్నపము

మంజరీ ద్విపద :
వినవయ్య నామొఱ విశదము గాను,
జగతిన పడుచున్న జనుల బాధలను,
దయతోడ జూపుమ ధర్మ మార్గమును,
వేణుగోపాల! శ్రీ బృందావిహారి!
ఎన్నని చెప్పను యేవిధ ముగను,
ఒకటి, రెండుయు కాదు యోపిక తోడ
వినవయ్య నామొఱ విశదము గాను
వేణుగోపాల! శ్రీ బృందావిహారి!
ప్రకృతి విలయ తాండవము తోడ వణకె
లోకము, ప్రబలగ రోగముల్ జనులు
కకలా వికలమయి కష్టము లొందె
వేణుగోపాల! శ్రీ బృందావిహారి!

**వసుమతీ జగన్నాథం.**
**హైదరాబాద్.**

## "తొలకరి"(తేటగీతులు)

నీలి నింగిని మూగిన నీరదములు
చిత్తమునలర జేసెడి చినుకులగుచు
నిగ్గు దేలగ సరికొత్త నీటి జల్లు
తొలకరిగ నభివర్షించి తోషమిడును !
ప్రాణ ధాతువై స్పృశియింప పరవశించి
మొలకలెత్తు నంకురములు ముదము
తోడ
పరిసరమ్ముల వ్యాపించు పచ్చదనము
కొత్త సృష్టికి మూలమై కుదురుకొనును !
ఎలమి నెలగోలు జల్లుల నెఱతనములు
మట్టి పరిమళమ్ములు జేయు
మంతనములు
నవరసాన్విత యగుచు కొనగొని ప్రకృతి
వింత హాయి నందించును పెంపుమీఱి

**శ్రీమతి టి. లక్ష్మీకృష్ణ**
**హైదరాబాద్**

## సమగ్రత (కందములు )

ఎవతికి వాఱుగ నిలచుట
యవనిన జనులకదెట్లు
యభినందనగున్!
సవరణ జేయకనున్నను
సవాళ్ళె యీ గుణములు మన
జవములె కరగున్.
స్వార్థమదేలన యన్నన
స్పర్థలు గాదయ! కరవుగ శక్తులె
తనువున్!
వ్యర్థము వేఱు యుపాయము
యర్థము సరియగు విధముగ నన్నము
వలెనే.
శౌర్యము భారత వీరుల
చర్యలు! మనమైక్యత ధర విధి! యా
స్థైర్యము కర్తవ్యముతోడన్!
క్రౌర్యము మన
వాటిపైన
కలుగుట వలదే.

ఇరువంటి నాగ దుర్గా మాధురీ దేవి ది

**శినాగినిరి**
**భాగ్యనగరము**

## స్వప్న ప్రకరణము 8

ఆ వె
కలల ఫలితములకు కష్ట సుఖములకు
పొంతనుండుననియు పోల్చలేము
విశ్వసించువారి విశ్వాసమేతప్ప
కలలు దినదినంబు గలుగుచుండు
కలలు :- వివరణ
కలలను మన పూర్వీకులు దృష్టము, శ్రుతము, అనుభూతము, ప్రార్థితము, కల్పితము, భావికము, దోషజములనే ఏడు విధములుగా విభజించారు.
కలలను జీవశాస్త్ర దృక్పథంతో చూస్తే నిద్రలో నాడీ సంకేతాల చలనాలకు ఫలితంగా చెప్పుకోవచ్చు. మనస్తత్వ శాస్త్ర రీత్యా సుప్త చేతనలో జరిగే చలనాలకు ప్రతిబింబాలు గాను, సాంప్రదాయ ఆరోగ్య దృక్పథంతో చూస్తే నిద్రావస్థలో జరిగే వాత పిత్త శ్లేష్మ చర్యల వలన నాడులలో కలిగే సంకేతాల ఫలితాలు కలల రూపంలో ప్రతిబింబిస్తూంటాయి అనీ చెప్పుకోవచ్చు. ఏదేమైనా కలలు మానవ జీవితంలో ఒక దైనందిన విశేషమే. ఆధ్యాత్మికంగా చూస్తే కొన్ని కలలు దివ్య సందేశాలుగానూ, భవిష్య సూచికలు గాను చెప్పుకోవచ్చు.

**సత్యనారాయణ బొలిశెట్టి,**
**హైదరాబాద్**

## సమయ పాలన

తే.గీ.
కాలమును వృథా చేయక గడుపు
మనిషి
పద్ధతిగ ముగియించును పనుల నెపుడు
వేళ తప్పిన కార్యముల్ విఫలమగుచు
సమయ పాలన గెలుపుకు సాధ్యపడును
తే.గీ.
పద్ధతిని వీడు పనులెల్ల పనికి రాని
చేష్టలుగ మారి బ్రతుకున చేటు జేయు
నియమ మున్నట్టి మనుజుడే
నిశ్చయముగ
కీర్తి గడియించి పొందును గెలుపు
నెపుడు
తే.గీ.
వరుస తప్పిన పనులెల్ల వగపు దెచ్చి
నియతి లేకున్న నరులకు నింద
పడును
కర్మల నెరవేర్చి సదా సకాలమందు
నిలకడగ నుండు నెప్పుడు నీతి పరుడు.

**మరింగంటి శ్రీనివాస్**
**హైదరాబాదు**

## అమ్మ! (గజల్)

మాతృత్వమె మహోన్నతం మొక్కు
తుంది మానసమే!
మనుగడకే ఆధారం పొంగుతుంది
మానసమే!
అమ్మ ఒడి వెచ్చదనం ఆయువిచ్చి
పెంచును వడి!
తీర్చరాని ఋణముతలచి
కుములుతుంది మానసమే!
తిండి నిద్ర విస్మరించు తల్లి త్యాగ
క్షీరబలం!
లెక్క కట్ట లేని ప్రేమ మురుస్తుంది
మానసమే!
విజయాలకు వెన్ను తట్టు అపజయాల
ననునయించు!
తీరదామె లేని లోటు తలుస్తుంది
మానసమే!
విధి రాతలనైన తల్లి ఎదిరినిల్చి పోరి
గెల్చు!
ప్రాణమొడ్డు బిడ్డకనుచు కొలుస్తుంది
మానసమే!
యోగికైన భోగికైన చరణధూళి
ముక్తినొసగు!
దైవానికి పోటీగా పొగుడుతుంది
మానసమే!

చలువలోన చందమామ గంగకన్న
పూత కుసుమ!
అమ్మెరుగని అనాథగని పొగులుతుంది
మానసమే!

**కుసుమ ఉప్పలపాటి**

## ఆదిదైవము

**ఆటవెలదులు**
అమ్మచేతి బొమ్మ నందాల బాలుడు
విఘ్నరాజు వీడు వీత భయుడు
సకల శుభముల నిడు సజ్జనుల కిలలో
ఆదిపూజ్యుడితడు హస్తిముఖుడు
విద్యనొసగు మాకు వినయమ్ము తోడుగ
విజయములిడు మాకు విఘ్న రాజ!
గద్య, పద్య రచన ఘనముగా
వ్రాయంగవేడుకొంటినయ్య వేగరావ! ,,
గణములకును దొరవు గణనాథ
బ్రోవుమ నిలను వెల్గుచున్న ఈశ
సుతుడ!వినుతి సేతు నయ్య విశ్వ వం
దిత ముదము తోడ నీవు వేగ రావ!,,

**శర్వాణి సత్యప్రసాద్ పాతూరి**

## అన్నదముల-అనుబంధం

మేమిద్దరం అన్నదమ్ములం
ఎప్పటికీ కలిసిమెలిసుంటాం!
నాకంటే పెద్దోడు,అతడే నాకు
మార్గమౌతాడు
కష్టాల్లో ధైర్యంగా నిలుస్తాడు
గెలుపోటముల్లో భాగమౌతాడు!
తొడబుట్టిన అన్న, అతడే నాకు రెండవ
నాన్న
మాటిస్తే తప్పనివాడు, వెనుకడుగు
వేయనివాడు!
అమ్మలా అనురాగం పంచుతాడు
నాన్నలా నడక నేర్పిస్తాడు!
నీకంటే చిన్నోడు నీకు అండగా
నిలుస్తాడు
చిన్నప్పటి నుండి నిన్ను చూసి
పెరిగినోడు
భవిష్యత్తులో నీకు తోడుగా నిలుస్తాడు
మనం కలిసి అడుగు వేయాలిరా
ఇక విజయాలే మనకు సోదరా..!

**గడ్డం అభిలాష్ సిద్దిపేట**

## ఏరువాక

తే. గీ.
ఏరువాకలో హాలికు లెఱుక కల్గి
సక్రమంబుగ కార్యముల్ చక్కబెట్టి
దుక్కి దున్ని యా వరుణుని
మ్రొక్కుకొనుచు
విత్తు జల్లిరి కలిమిని వృద్ధి చేయ.//
తే. గీ.
కారుమబ్బులు దివిపైన క్రమ్ముకొనెను
చల్లగాలులు వీయగ సర్రుమనుచు
ధరణి తడిసెను వర్షపు ధారలందు
పల్లె పల్లెలో భాగ్యపు జల్లు కురిసె.//
తే. గీ.
ఆరుగాలము కష్టించి యన్నదాత
భువికి బువ్వను పెట్టెడి పుణ్యశీలి.
వర్షఋతువున
పొలములో పంటవేసి
సంపదలను
సృష్టించునా సైరికుండు.//

**టి. వి. యెల్. గాయత్రి.**
**పూణే. మహారాష్ట్ర.**

## శ్రీరామచంద్రుడు కవిత

చందనం పంచుతుంది
సుగంధం
గౌరవానికి ప్రతీక వందనం
శ్రీరాముడు ధరించెను కోదండం
రాజేంద్రుడి అందం సుగుణం
ఆదిపురుషుడు చేసెను మేధోమధనం
రాఘవుడి లీలలు అఖండం
సంపూర్ణ రామాయణ పఠనం
మనోహరం
విన్న వారి
జన్మ పరిపూర్ణం

**సంగీతకరీంనగర్**

## "అందము"

కం.:
అందమునకు నిర్వచనము
డెందమునకు హాయి గూర్చెడి
విషయమౌచున్,
వందన యోగ్యుడు సృజనపు
చందమునకు కర్తగ నిలు సర్వేశ్వరుడౌ.
కం.:
కన్నుల గాంచిన వన్నియు
చెన్నుగ బాహ్యాకృతులు నశించుచు
విధిగన్,
తెన్నుగ నిలు చిరకాలము
వన్నెలు గుణములిడు నరుల వరముగ
పుడమిన్.
కం.:
కృత్రిమ సాధనములతో
చిత్రముగ నగు సొగసు లిడు చిక్కులు
మెయినిన్,
పాత్రత సందిగ్ధంబౌ,
మాత్రము మించిన శిథిలము మనుగడ
యగుచున్.

**వేగరాజు సాయి వర ప్రసాద్,**
**హైదరాబాదు**

## ఉదయపు నడక

కం.
ఉదయపు కాలమునందున
పదములు మునుముందువేసి పదపడి
నడువన్ కదలును కండలు జవమున
పదిలంబగు వాయువులవి ప్రాణము
నిల్పున్.
కం.
దేహారోగ్యము నిడు ,మధు
మేహమ్మునుతొలగు ,కాంతి మేనున
నిండున్
సోహము తత్వము నెలకొని
వాహకమై శక్తినిడును వన్నెలనీనున్.
కం.
రుధిరము శుద్ధత నందును
సుధలగు మంత్రాలమనన చూడగమేలౌ
బుధులందరు మెచ్చినదే
విధిగా నడవాలిమనము వేలుగ శు
భమౌ.
కం.
బరువును తగ్గును ,దేహము
సురుచిర కాంతులనునిండి శోభించు
సదా వరమగునారోగ్యంబే
నరుడా!నీనడక నీకు నవ్యజవంబౌ.

**అవధానిని.డా.గాయత్రీదేవి**
**హైదరాబాద్.**

## మాతృదేవోభవ (ఉత్పలమాల)

సృష్టికి మూలమై నిలుచు క్షీరపు ధారల
నిన్ను బెంచుచున్దృష్టిని బొందనీక నిను
తీరుగ దాచి మరింత ప్రేమనేవృష్టిగ
జిల్కరించి తన వేదన నంతయు మర్చి
పోవునే!కష్టమటంచునూర్కొనదు! గన్నుల
పాపకు రక్షనిచ్చుతా!కన్నుల
కాంతిచిందు తన కన్నడి ముద్దుల
మోము జూడగన్చన్నుల బాలనిచ్చి
నిను సాకును రక్తము క్షీరమవ్వగా
వెన్నుని వోలె బాలునకు వేణువునిచ్చును
నూద పొంగుచున్!మిన్నుల దాకు
సంతసము మీటిన మాతృ
హృదంతరాళముల్!పొర్ల
వేణుగోపాలరావు
**ఎల్లారెడ్డిపేట**
**రాజన్న సిరిసిల్ల జిల్లా**

## భద్రాచల మహాత్మ్యం

సీసం:
పర్ణశాలకు జేరి పవ్వళించినరోయి
పడతిసీతనుగూడి పరవశించి!
సౌమిత్రి వారికి సకల సేవలు జేయ
సంబరపడినారు సంతసాన!
చుప్పనాతి యొకతి చూడవచ్చె వనము
రాముగాంచిమురిసె రయముగాను!
వగలుపోవుచుదతానువయ్యార మొలు
కుచూ సయ్యాటలాడమనె సరసముగను!
ఆ. వె:
ఒక్క భార్య నాకు! యొక్క మాటయె నాది
వేరు మాట లేదు వేగ పడకు!
అనుచుచెప్పినాడు అజరాజ పౌత్రుడు
భద్రగిరినివాస భవ్య చరిత!!

**డా. యర్ర హరికిషన్, తుంగతుర్తి**

## అంశం: తెలుగు భాష

నన్నయాది కవులు నడక నేర్పిన భాష
కవుల కవనమందు ఘనతకెక్కె
తిక్కనాది కవులు తీర్చిదిద్దిన భాష
తేనెలొలుకు తెలుగు!తీపి పలుకు!
అమ్మపాలవంటి కమ్మనౌ మనభాష
యమృత సమము, వినగ హాయినిచ్చు!
శారదాంబ క్షీరధారల ప్రాప్తంబు!
తేనెలొలుకు తెలుగు!తీపి పలుకు!
పంచదార కన్న పాలమీగడ కన్న
జుంటితేనె కన్న జున్ను కన్న
కమ్మనైన తెలుగు కావ్యంబులే మిన్న!
తేనెలొలుకు తెలుగు!తీపి పలుకు!

**వరలక్ష్మి యనమండ్ర**
**అద్దంకి, ప్రకాశం జిల్లా**

## జానకి ఓ లెజెండ్ (పంచపది)

జానకి నలభై వేలకుపైగా
పాటలనాలపించె
పలు భాషల్లో పాడి కీర్తి ప్రఖ్యాతులు
గడించె
మధురమైన గాత్రంతో ప్రేక్షకులను
మురిపించె
ఈమె గాయనీమణుల్లో లెజెండ్గా
పేరుగడించె
భారతీయ సినీ సంగీత క్షేత్రంలో
ప్రసిద్ధులు విఠల!
వయసునుబట్టి
స్వరాలు పలికించడంలో
మేటిమాతృభాషలో మీ,పరభాషలలో
లేరు సరిసాటి
ఉచ్చారణలో
భావాభివ్యక్తిలో రారెవ్వరూ పోటిజానకి
తెలుగు జాతి గర్వించదగిన స్వర
కిరీటిప్రేమ,భక్తి,
జానపద,హుషార్,
విషాధ పాటలు పాడె విఠల!
జానకమ్మ పాటల
పూలతోటలో ఓ సిరిమల్లిసినీ
వినీలాకాశములో పున్నమినాటి
జాబిల్లిభావానికి
తగ్గ స్వరమందించిన సురాగాల వల్లి
గానం ప్రాణంగా
సప్తస్వరాలొలికించిన
కల్పవల్లి
పసితనంలోనే
పసిడి గీతాలు
పలికిందిగా
విఠల!

**కాటేగారు పాండురంగ విఠల్**
**హైదరాబాద్**

## కూర్మావతారము

తే.గీ
కూర్మ రూపమున్ దాల్చగా కూర్మితోడ
మందరగిరినెత్తి హితుడై మాధవుండు
మోహినిగ వచ్చినమృతము మోదమలర
దేవతాళికొసగి వారి దిగులు దీర్చె
పం.చా.
విరామమొందకుండ రక్ష వేగ సేయు
విష్ణువేదచిరాయువొంది దేవతాళి
శ్రేష్ఠులైరి మాన్యులై
పరాత్పరుండు జన్మమెత్తి ప్రాప్తి జేయు
నిక్కమౌ కరంబులెత్తి ప్రస్తుతింతు
కార్యశూర్యుడాతనిన్
తే.గీ.
యుగపురుషుడగు పరమాత్మ
యుద్భవించి
శిష్టరక్షణ జేయును శ్రీనిలయుడు
దుష్టులను దునిమాడగ దురితదూర
ధర్మము నిలుపు దయగొని
ధరణియందు

**మాతా గంగాభవాని శాంకరీ దేవి,చెన్నై.**

## సంధ్యా రాగంలో చెలియ భావన ప్రక్రియ : కవిత

కుంకుమ వర్ణపు సంధ్యా వేళ,
సింగారించుకుంది ప్రకృతి బాల,
గలగలలాడే ఏటి సెలయేరు
నడుమ కనువిందు చేసే పూదోట.
లావెండర్ రంగుల పట్టు చీరలో
సిరిమల్లెలు తురిమిన కొప్పుతో,
రాతిపై కూర్చున్న ఆ రూపం,
ఏదో మధుర భావనల కావ్యం.
కొమ్మన చేరిన పిట్టల జంట,
చెలియ మనసు మురిపించే నంట,
పారేటి సెలయేటి సవ్వడిలో,
కరిగిపోతోంది కాలం ఈ ఏకాంతంలో.
మునిగిపోయే భానుడి వెలుగు,
ఆమె కనులలో ఏదో ఆతృత
ప్రకృతి ఒడిలో ఒదిగిన క్షణాన,
మనసంతా నిండెనుఅమృతామృత
భావన.

**కానుకొలను లక్ష్మీసీత**
**హైదరాబాద్**

## శీర్షిక: అందం...

అమ్మకు బిడ్డే అందం
అబ్బాయికి అమ్మాయే అందం
మమకారాలకు అనుబంధాలే అందం
మనుష్యులకు ప్రేమల మాధుర్యాలే
అందం
ప్రకృతి ఆకృతికి పచ్చటి రంగే అందం
చదువుల సరస్వతికి సంస్కారమే
అందం
మానవ జాతి సమస్తానికి సామరస్యమే
అందం
దేవాలయ ప్రాంగణంలో దేవుని సన్నిధే
అందం
అందంగా కనిపించాలనే అందరికీ
కల్మష రహిత అంతరంగమే
అందం
మేడలు మిద్దెలు ఆకాశాన్ని తాకినా గాని
అందు కలివిడిగా తిరిగే వారే
అందం
అందరూ కలిసిమెలిసి ఉంటే అందం
అందులోనే దాగున్నది అందరి బంధం

**శశిశేఖర్ అల్లంకి ఏలూరు**

## శీర్షిక: విద్య - గురువు

తేటగీతి
చీకటిని చెరిపి వెలుగు చిలకరించు
మస్తకమును నింపును జ్ఞాన మార్గ మొసగి
తత్త్వవేత్తగ, నేస్తమై తను గెలువని చోట తలెగరగన్ జేయు చోదకుడుగ ॥
కందంఅక్షర సేద్యము చేయ నిరక్షర కుక్షికి చదువులు రక్షగ నిలుచున్
దక్షతను బెంచి జీవన సూక్ష్మ మెరుక జేసి బ్రతుకు సులువుగ జేయున్ ॥
తేటగీతి శ్రద్ధ పట్టుదల గలిగి శ్రమను చేయ విద్య నేర్చు విద్యార్థులు వెలుగులీను
విద్య నొసగిన గురువుకు విలువ నిచ్చి ప్రణుతిలిడు మెపుడు చదువు ప్రగతి బెంచ ॥

**తిరుకచ్చి శ్రీనివాస్ బాబు**

ఆదివారం, జూలై 19, 2026

నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644



## స్థానిక కార్పొరేటర్ సొగాని కొమరయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో స్థానిక కార్పొరేటర్ సొగాని కొమరయ్య ఆధ్వర్యంలో అపోలో రీచ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ప్రారంభమైంది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుని వైద్య శిబిరంలోని సౌకర్యాలను పరిశీలించారు. స్థానిక ప్రజలు అపోలో వైద్యులు అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరునాధర్ (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ సుబ్రత్ కుమార్ సోరెన్ (న్యూరో ౼ స్పైన్ సర్జన్) తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన చెస్ ఛాంపియన్‌షిప్ - 2026



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ వి-కన్వెన్షన్‌లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫోర్త్ ఆల్ ఇండియా ఓపెన్ ౼ జూనియర్స్ చెస్ ఛాంపియన్‌షిప్ -- 2026 పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై చదరంగ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారుల్లో మేధాశక్తి, ఏకాగ్రత పెంపొందించడంలో చెస్ కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు కంకటి అనూప్ మాట్లాడుతూ, విజేతలకు వందకు పైగా బహుమతులతో పాటు లక్షా ఇరవై ఐదు వేల రూపాయల నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. ఏపీపీ చంద్ర, క్రీడా సంఘాల అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, పండుగ నాగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ధరలు అదుపులోకి తేవాలి రాయి కంటి శ్రీనివాస్



**మానకొండూర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయి కంటి శ్రీనివాస్ అన్నారు. వర్షాభావం, ఉపాధి కరువు కారణంగా రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతుండగా, వస్తువుల ధరలు అమాంతం పెరగడం పుండు మీద కారంలా మారిందని ఆయన విమర్శించారు. అల్లం, ఉల్లి, వెల్లుల్లి, ఎండుమిర్చి, పప్పులు, చక్కెర, కూరగాయల ధరలు 30 నుంచి 100 శాతం వరకు పెరిగాయని, కోడిగుడ్డు ధర కూడా రూ.6 నుంచి రూ.8కు పెరిగిందని తెలిపారు. నాలుగు సభ్యుల కుటుంబంపై నెలకు రూ.2,500 వరకు అదనపు భారం పడుతోందని, కూలి మాత్రం పెరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత వల్ల కొద్దిమంది వ్యాపారులు లాభాలు పొందుతుండగా, కోట్లాది ప్రజలు ఆకలితో అల్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు రేషన్ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు తదితర వస్తువులను రెట్టింపు పరిమాణంలో పంపిణీ చేస్తే పేద కుటుంబాలకు కొంత ఉపశమనం లభిస్తుందని, ధరల పెరుగుదలను అదుపులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర



**జగిత్యాల, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇస్కాన్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, జగన్నాథుని కృపతో సమృద్ధిగా వర్షాలు పడాలని, ఎల్‌నినో ప్రభావం తొలగిపోవాలని ఆకాంక్షించారు. బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి కూడా రథయాత్రలో పాల్గొని స్వామివారిని ప్రార్థించారు. జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, వార్డు కౌన్సిలర్లు వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమతతో పాటు పలు నాయకులు, భక్తులు, మహిళలు పాల్గొని రథయాత్రను విజయవంతం చేశారు.

## ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



**రామడుగు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామడుగు మండలం వెంకట్రావుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నే. పూరి కరుణాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థుల ప్రగతి, నమోదు అంశాలపై చర్చించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రెగ్యులర్‌గా బడికి పంపి ఇంట్లో చదివిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నో బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు గీత, శ్రీలత, రవీందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమన్వయం చేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన ప్రతిభ కనబరుస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల పనులను రానున్న ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్--టీచర్ సమావేశాలకు హాజరై పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, ఇంట్లో హోంవర్క్ పూర్తి చేసేలా పర్యవేక్షించాలని తల్లిదండ్రులకు సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం కలిసి పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డి.ఈ.ఓ. శారద, జి.సి.డి.ఓ. కవిత, సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ తిరుపతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సెర్ప్ సీఈఓ హామీలను అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్

**హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఓఎస్డీకి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు తలపాక కిష్టయ్య మాట్లాడుతూ, ఐకేపీ వీఓఏలకు నెలకు రూ.26 వేల వేతనం అమలు చేయాలని, సెర్ప్ సీఈఓతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 25 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వీఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వేతన హామీలు ఇంకా అమలు కాలేదని, కొత్త యాప్‌లు, అదనపు విధులు అప్పగిస్తూ పని భారం పెంచుతున్నా తగిన వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల అనంతరం సెర్ప్ సీఈఓతో జరిగిన చర్చల్లో పలు హామీలు లభించాయని, వాటిని వ్రాతపూర్వక సర్క్యులర్ రూపంలో జారీ చేసి అమలు చేయాలని కోరారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి అర్హులైన వారిని కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాల పెంపు, బీమా సౌకర్యాలు, గ్రామ సంఘాలకు ట్యాబ్ నెట్ సౌకర్యం, ఆదాయం లేని సంఘాలకు రూ.20 లక్షల నిధి మంజూరు వంటి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగాం బాబు, జిల్లా కార్యదర్శి డప్లికర్ శంకర్, ఇర్కోడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



# జూలై 31లోగా పాఠశాలలలో ప్రవేశాలు పూర్తి చేయాలి

**- కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో జూలై 31లోపు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థుల ప్రవేశాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, త్వరలో అల్పాహార పథకం అమలులోకి రానుందని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని నిర్దేశిత మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని సూచి చారు. యూ-డైస్ ఎంట్రీలు పెండింగ్‌లో ఉన్న పాఠశాలల్లో వెంటనే ప్రక్రియ పూర్తి చేసి అడ్మిషన్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ప్రాథమిక స్థాయి నుంచే చదవడం, రాయడం నైపుణ్యాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విబిజీ--రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఫార్మ్ పాండ్స్, బోర్‌వెల్ రీచార్జ్, మట్టిది నిర్మాణాలు, ప్రజా పారిశుద్ధ్య సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్య పనులకే వినియోగించాలని, మిషన్ భగీరథ కనెక్షన్లు, మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ప్రత్యేక అధికారి ఉమారాణి, జెడ్పీ సీఈఓ రమేష్, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ రవీందర్, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

**మంచిర్యాల, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దండేపల్లి మండలం గూడెం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో తన తాత కాకా వెంకటస్వామి ఈ ట్రస్ట్‌ను స్థాపించారని గుర్తుచేశారు. గూడెం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే అవసరమైన బెంచీలను అందజేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునే వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఎంపీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి వస్తుండగా కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమే అయినప్పటికీ ప్రజల అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గూడెం ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కూడా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని గుర్తుచేశారు. అయితే అలాంటి విషయాలను పట్టించుకోకుండా ప్రజల అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయడమే తన ఆకాంక్ష అని వంశీకృష్ణ స్పష్టం చేశారు.



# ఎస్సీ, ఎస్టీల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలి - కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. బాధితులను గౌరవంగా కూర్చోబెట్టి వారి సమస్యలను ఓపికగా వింటేనే వారికి న్యాయం జరిగిందనే నమ్మకం కలుగుతుందని అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో కన్విక్షన్ రేట్ పెంచేందుకు పోలీసులు నాణ్యమైన దర్యాప్తు చేసి సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. ప్రతి నెల "సివిల్ రైట్స్ డే", ప్రతి మూడు నెలలకు విజిలెన్స్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలయ్యేలా ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని, పీఎం విశ్వకర్మ పథకం ద్వారా సాంప్రదాయ వృత్తిదారులకు శిక్షణ, ఆర్థిక సహాయం కల్పించాలని సూచించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న రూ.30 లక్షల యూబీఐ బీమా సదుపాయాన్ని ఇతర పట్టణాల్లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పనితీరును అభినందించిన ఆయన, ఇదే స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, విద్య, ఉపాధి, జీవనోపాధి అంశాల్లో మరింత చొరవతో పనిచేయాలని కోరారు. కలెక్టర్ చిత్రా మిశ్రా కమిషన్ సూచనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని, పెండింగ్ నిధుల వివరాలను నిర్దేశిత సమయంలో సమర్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
ఆదివారం, జూలై 19, 2026



## కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను టీపీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ శనివారం నియమించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ నియామకాలు చేపట్టామని తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ నలుగురు మహిళలకు అధ్యక్ష పదవులు కల్పించామని పేర్కొన్నారు.కొత్తగా నియమితులైన అధ్యక్షులు ప్రజా సమస్యలపై పోరాడి, పార్టీ విధానాలను ప్రతి ఇంటికి చేరవేయాలని ఆయన ఆకాంక్షించారు.

## రూ.2.55 కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2.55 కోట్ల డీఎంఎఫ్‌టి నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు శనివారం పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు .పెద్దకల్వల, నిట్టూరు, తుర్కల మద్దికుంట, బొంపల్లి, రాగినేడు, అప్పన్నపేట గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించగా, బొంపెల్లి--తెనుగుపల్లి మధ్య రూ.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తో ందని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహారం, పౌష్టిక ఆహారం అందిస్తూ ప్రైవే టు పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి మండలం, పట్టణంలో పాఠ శాలల అభివృద్ధికి రూ.5.70 కోట్లు మంజూరయ్యాయని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో విద్యా ధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై ఆరోపణలు ఆధారరహితం

**– మోలుమురి చంద్రశేఖర్**




పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన ఆరోపణలు పూర్తిగా ఆధారరహితమని ఎస్సీ, ఎస్టీ, బీసీ (జేఏసీ) జిల్లా కన్వీనర్ మోలుమురి చంద్రశేఖర్ ఖండించారు.పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని, వేలాది మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించారని గుర్తు చేశారు. గురుకులాల్లో అవినీతి జరిగిందంటూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం బాధ్యతా రాహిత్యమని పేర్కొంటూ, బాలరాజు వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలని ఐక్యవేదిక డిమాండ్



పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆల్ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో శుక్రవారం కమిషన్ చైర్మన్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలకు వినతిపత్రం సమర్పించారు. దళితులపై దాడులు, భూ ఆక్రమణలు, ఆలయ ప్రవేశానికి అడ్డంకులు, కుల బహిష్కరణలు, హత్య కేసులు, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో ఆలస్యం వంటి అంశాలను వివరించారు.బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంకై కలెక్టరేట్ ముట్టడికి కార్మికుల పిలుపు



హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ముట్టడిని విజయవంతం చేయాలని సైదాపూర్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రాధారపు సంపత్ పిలుపునిచ్చారు.ప్రతి గ్రామం నుంచి కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల ప్రయోజనాలకే వినియోగించాలని, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కుల సాధన, సంక్షేమ పథకాల అమలు కోసం కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## దుర్గాభవానీ అమ్మవారికి క్యాప్సికమ్ మాలలతో అలంకరణ



కరీంనగర్ రూరల్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో శనివారం అమ్మవారిని క్యాప్సికమ్ మాలలతో అలంకరించారు.ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## భారతదేశ సాంకేతిక చరిత్రలో కొత్త అధ్యాయం




కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ క్లాస్ రాకెట్‌ను హైదరాబాద్‌కు చెందిన స్కై రూట్ ఏరోస్పేస్ సంస్థ విజయవంతంగా ప్రయోగించడం భారత సాంకేతిక చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాసిందని ఆల్ ఫోర్స్ పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక విజయోత్సవ సమావేశంలో పేర్కొన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లి చరిత్ర సృష్టించిందని వారు తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా భారత్ ప్రపంచ దేశాల సరసన నిలిచిందని, 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో రూపొందించిన రాకెట్ నైపుణ్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు శాస్త్రవిజ్ఞానంపై పట్టు సాధించి, కొత్త ఆవిష్కరణలకు దారితీయాలని సూచించారు. రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడంతో విద్యార్థులు జాతీయ జెండాలు ఊపుతూ "జయహో భారత్" నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని మోసం చేస్తున్న సీడ్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్





హుజురాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలో రైతులను మోసం చేస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైతులకు రావలసిన డబ్బులు ఇప్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. హుజురాబాద్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు అగ్రిమెంట్ ప్రకారం విత్తనాలను సీడ్ ప్లాంట్లకు విక్రయించిన తర్వాత ధరలు తగ్గించడం రైతుల గొంతు నులకడమేనని విమర్శించారు. 2025లో చేసిన ఒప్పందాన్ని విస్మరించి, 2026లో కొత్త అగ్రిమెంట్ రాసి రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.ప్రతి సంవత్సరం తూకం పేరుతో కోట్ల రూపాయలు అక్రమంగా గడిస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై నాన్‌బెలేబుల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు రావలసిన ధాన్యం డబ్బులు చెల్లించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రైతులకు సరిపడా ఎరువులు, విత్త నాలు, విద్యుత్ అందించాలని ఆయన డిమా ండ్ చేశారు.ఈ సమావేశంలో పార్టీ నా యకులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపు




కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జూలై 29, 30 తేదీల్లో కరీంనగర్‌లో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను ఈ సమావేశాల్లో రూపొందిం చనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులను నియంత్రించే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశాలకు ఎసఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టా చార్య, జాతీయ ఉపాధ్యక్షురాలు ఆయుష్ ఘోష్ హాజర ుకానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు ఇసాక్, సహాయ కార్యదర్శులు బోగేష్, గట్టు ఆకాశ్, సభ్యులు రోహిత్, సందేశ్, రక్షక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ బజార్ రోడ్ విస్తరణ తగ్గింపు పై మున్సిపల్ కమిషనర్‌కు వినతి



హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ బజార్ రోడ్డును 70 అడుగుల వరకు విస్తరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన మార్కింగ్‌ను నిలిపివేయాలని, రోడ్డు వెడల్పును తగ్గించాలని కాలనీవాసులు మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి, బీఎస్పీ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ పేరుతో పేద ప్రజలు తమ ఇళ్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 40 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో 22 అడుగుల బీటీ రోడ్డు ఉండగా, వాహన రద్దీ కూడా పెద్దగా లేదని తెలిపారు. రామవరం వైపు బైపాస్ రోడ్డు ప్రతిపాదన ఉన్న నేపథ్యంలో ఈ రోడ్డును 70 అడుగులకు విస్తరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే పేదల ఇళ్లను కూల్చివేసే నిర్ణయాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో భూక్యా లక్ష్మన్ నాయక్, మార్క శ్రీనివాస్, పెరుమాండ్ల శ్రీనివాస్, లక్ష్మిరాజిరెడ్డి, మొం దయ్యతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి సహకరించిన సర్పంచ్‌కు ఘన సన్మానం



ఖానాపూర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మండలంలోని బావాపూర్ కే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 33 నుండి 80కి పెరగడానికి సహకరించిన గ్రామ సర్పంచ్ మైస రాజేశ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సంతోష్ శనివారం ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో జరిగిన పేరెంట్స్--టీచర్స్ సమావేశంలో ఆయనను శాలువాతో సత్కరించారు. విద్యార్థులను పనులకు పంపకుండా రెగ్యులర్‌గా పాఠశాలకు పంపితే నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. తల్లిదండ్రులు సమావేశాలకు హాజరై పిల్లల విద్యా విషయాలను తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సర్పంచ్ రాజేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ విరాళం



ఖానాపూర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు 40 వేల రూపాయల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను శ్రీ ధనలక్ష్మి సెలక్షన్స్ ప్రొప్రైటర్ చౌడారపు రవీందర్ సతీమణి చౌడారపు శ్యామల జ్ఞాపకార్థంగా శనివారం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు బి. సంధ్యారాణికి యంత్రాన్ని అందజేసి, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, రవీందర్ కుమార్తె శ్వేత, పట్టణ వ్యాపారవేత్త గంప గంగాధర్, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు ఆర్టీసీ బస్సులు ఢీ ఇద్దరికి గాయాలు



ఖానాపూర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బాదం కుర్తి బ్రిడ్జిపై శనివారం ఉదయం రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.మెట్పల్లి డిపోకు చెందిన బస్సులు ఖానాపూర్--మెట్పల్లి మార్గంలో ప్రయాణిస్తుండగా బ్రిడ్జిపై ఢీకొన్నాయి. డ్రైవ ర్లు, ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.బస్సు వెనుక వస్తున్న కారు కూడా ఢీకొనడంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## ధ్రువ పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ



ఖానాపూర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలోని ధ్రువ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం బోనాలు నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి ఇంటి వద్ద బోనాలను తయారు చేసి పాఠశాలకు తీసుకువచ్చారు. అనంతరం డీజే పాటలతో పట్టణ ప్రధాన రహదారులపై ఊరేగింపుగా బోనాలు తీశారు. విద్యార్థులు కాళీమాత, చండీమాతలుగా అలంకరించుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆకుల విష్ణు, ప్రిన్సిపల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు ప్రవళిక, నదియా, విద్యార్థులు, యాజమాన్యం పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లలను పనులకు కాకుండా పాఠశాలకు పంపాలి

**– ఎంపీడీవో రాధా రాథోడ్**



ఖానాపూర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా ప్రతిరోజూ పాఠశాలకు పంపే బాధ్యత తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి రాధా రాథోడ్ సూచించారు.శనివారం ఎల్లాపూర్ ఉన్నత పాఠశాల, సత్తనపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, నోటు పుస్తకాలు, రాగి జావ, షూలు, టై వంటి సౌకర్యాలు అందిస్తున్నందున విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరుకావాలని అన్నారు.ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జాడ భీమలింగం మాట్లాడుతూ, విద్యార్థులు సమయానికి పాఠశాలకు రావాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు సమయానికి ఆలస్యమైతే గైర్హాజరుగా నమోదు అవుతుందని తెలిపారు.ఈ సమావేశంలో ఉపాధ్యాయులు రమాదేవి, శ్యామ్ కృష్ణ ప్రసాద్, జోగు శ్రీనివాస్, సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా ఆషాఢ బోనాల పండుగ



కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇ.మీ. హైస్కూల్‌లో శనివారం ఆషాఢ మాసపు బోనాలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో తలపై బోనం ఎత్తుకొని, విద్యార్థులు పోతు రాజుల వేషధారణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల ప్రాంగణం పూలతోరణాలు, మామిడి ఆకులతో అలంకరించబడింది. ప్రధానాచార్యుడు మోర రణధీర్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, ఆచార్యుల బృందం పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ శ్రీనివాస్



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో 67వ బూత్ బూత్ లెవల్ ఆఫీసర్ సమక్షంలో సర్ ఫారంలో వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకున్నారు. నమోదైన వివరాలను డిజిటల్ విధానంలో ధృవీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రతి అర్హత ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఓటరు జాబితా తప్పులులేని విధంగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని, అందరూ ఎన్నికల సంఘానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.పి.ఓ పరశురాములు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## కురుమ యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా రావ రాజు నియామకం



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కురుమ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా పర్లపల్లి గ్రామానికి చెందిన రావ రాజును నియమించారు. జిల్లా అధ్యక్షుడు కర్రె అనిల్ కుమార్ శనివారం ఈ నియామకాన్ని ప్రకటించారు. గత కొన్నేళ్లుగా కురుమ యువతకు సేవలందించిన రావ రాజుకు గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రావ రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు కర్రె అనిల్ కుమార్, నియామకానికి సహకరించిన జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలయ్య, ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల నరసింహ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీ సమావేశం



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవితక్క కరీంనగర్ జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ కమిటీలను బూత్ స్థాయిలో నిర్మించాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం నాయకులు విస్తృత స్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నాగరాజు, మహిళా అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, మానకొండూర్ ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, భాసవేణి రాజేందర్, నూతి సాయి చరణ్, మ్యాక వినోద్, లింగంపల్లి శ్రీనివాస్, రాకేష్, ఎండి రజి, పూ సాల పవన్, ఎండి సల్మా, ఎండి అతహార్, చింతరెడ్డి జైపాల్ రెడ్డి,
జంగ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అందెశ్రీ జయంతి వేడుకలు



**హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రజా కవి అందెశ్రీ 67వ జయంతి వేడుకలు కోహెడ మండలంలో ప్రముఖ సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గీతం అపారమైన స్ఫూర్తినిచ్చిందని, కవులు, కళాకారులు, రచయితలు రాష్ట్ర సాధనలో పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉద్యమకారులకు గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాము సత్తయ్య, చిలుపూరి రాజిరెడ్డి, షేక్ కరీం భాయ్, ఆదిత్య, సాయి మనోజ్, వర్షిత్ తేజ, సంపత్, ఏస్ రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి పథకం అవగాహన సదస్సు



**పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజీలో శనివారం జాగృతి--2015 పథకం పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాస్, భాను మాట్లాడుతూ, అట్టడుగు వర్గాలకు చట్టపరమైన అవగాహన కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఫోక్సో చట్టం ప్రాముఖ్యత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అంశాలను విద్యార్థినులకు వివరించారు. సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేసి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేదారేశ్వర, న్యాయవాది శరత్ పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో చెక్ బౌన్స్ కేసులకై ప్రత్యేక లోక్ అదాలత్



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కోర్టులో శనివారం చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ పర్యవేక్షణలో, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి మరియు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో పరిష్కరించారు. ముఖ్యంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ లోక్ అదాలత్‌లో 27 చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి రూ.46,87,540, 37 బ్యాంకు కేసులకు సంబంధించి రూ.9,71,200 పరిష్కరించబడినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, బ్యాంకు అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## 112 మంది ట్రైనీ డీఎస్పీలకు సీపీ గౌష్ ఆలం ప్రత్యేక శిక్షణా సదస్సు



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ట్రైనీ డీఎస్పీలకు కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ప్రత్యేక శిక్షణా సదస్సు నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజె జ్యువెలరీ దోపిడీ కేసును కేస్ స్టడీగా తీసుకుని వివరించారు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ శిక్షణలో కేసు దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ గాలింపు, నిందితుల అరెస్టు వంటి అంశాలను వివరించారు. ఈ కేసులో కరీంనగర్ కమిషనరేట్ సాధించిన విజయానికి పై అధికారుల సహకారం, టీమ్ వర్క్ ప్రధాన కారణమని సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. బీహార్, బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, ముంబై, బెంగళూరు రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు గాలింపు జరిపి ఎనిమిది మంది నిందితులను పట్టుకున్న విధానాన్ని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఉన్నప్పటికీ, ఫీల్డ్ అనుభవం, సమష్టి కృషి ఉంటేనే క్లిష్టమైన కేసులను ఛేదించగలమని అధికారులు స్పష్టం చేశారు. ఈ కేస్ స్టడీ ట్రైనీ అధికారులకు విధి నిర్వహణలో ప్రాక్టికల్ గైడ్‌గా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్లు సృజన్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, తిరుమల్, ప్రకాష్, సరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ధర్మారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.20 లక్షల నిధులతో బోర్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి--కోటిలింగాల ఆలయాలను "టెంపుల్ సిటీ"గా అభివృద్ధి చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా పోరాడతానని స్పష్టం చేశారు. తాజాగా మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పాలకుర్తి చిన్న రాజేశం గౌడ్, అమరగోని అంజయ్య గౌడ్ కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మగాని తిరుపతి గౌడ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్య కర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువసంగ్రామ సభకు బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు




**బోడుప్పల్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు సరూర్‌నగర్‌లో జరుగుతున్న బీఆర్ఎస్ యువ సంగ్రామ సభకు శనివారం రోజున బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, యువ కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరారు. సభలో పాల్గొనేందుకు ఉత్సాహంగా బయలుదేరిన కార్యకర్తలునినాదాలతో ఊరంతా
సందడి చేశారు.

## కస్తూర్బా విద్యార్థుల అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి భరోసా



**- యూనిఫాంల పంపిణీ.. అదనపు గదులు, కంప్యూటర్ల ఏర్పాటుకు హామీ**

**ఆమనగల్లు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలలో గదుల కొరత ఉన్న విషయాన్ని గుర్తించి అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థినులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండేలా కంప్యూటర్లను ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఎంపీడీఓ జైరామ్ విజయ్, ఎంఈవో పాండు, పాఠశాల ఎస్ఓ పద్మ జ్యోతి, మేనేజర్ ఆంజనేయులు, టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, జిల్లా కార్యదర్శి వస్పుల మానయ్య, మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, గుర్రం కేశవులు, తెల్గమల్ల జగన్ కృష్ణ నాయక్, వగ్గు మహేష్, ప్రసాద్, బాబా, అబు ల్ అలీమ్, వస్పుల శ్రీకాంత్, ఎండి ఫరీద్, ఇమ్రాన్ బాబా, శేఖర్ గౌడ్, విజయ్ నాయక్, కొండల్ రెడ్డి, కుమార్ గౌడ్, రాగ్య, గోపాల్, శివ,
శ్రీను నాయక్, సలీం
తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

**- వలస సుభాష్**



**హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రకృతిని ప్రేమించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి గ్రామీణ, పట్టణ యువజన సంఘాలు మొక్కలు నాటాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, యువజన అవార్డు గ్రహీత వలస సుభాష్ పిలుపునిచ్చారు. అమ్మ పేరున మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దామని, కాలుష్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. భావితరాల కోసం మొక్కలను సంరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, ఆరోగ్యకరమైన సమాజం కోసం పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని అన్నారు. సంకల్ప సంస్థ తరఫున "ఇంటికో చెట్టు -- ఊరంత వనం" అనే నినాదాన్ని ప్రకటిస్తూ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని వలస సుభాష్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల శిక్షణ




**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో శాతవాహన విశ్వవిద్యాలయం సహకారంతో "ఎన్హాన్సింగ్ టీచింగ్ ఎక్సలెన్స్ త్రూ ఐసీటీ" అంశంపై రెండవ రోజు అధ్యాపకుల అభివృద్ధి శిక్షణా శిబిరం జరిగింది. మొదటి సెషన్‌లో నైట్ అసోసియేట్ ప్రొఫెసర్ రాజ్ కుమార్ ఉన్నత విద్యలో ఐసీటీ టూల్స్ ప్రాముఖ్యతను వివరించారు. రెండవ సెషన్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయి శరణ్ ఆన్లైన్ అసెస్మెంట్, ఎవాల్యూయేషన్ టూల్స్ గురించి వివరించారు. మూడవ సెషన్‌లో నైట్ అసోసియేట్ ప్రొఫెసర్ రాహుల్ డేటా అనాలసిస్, రీసెర్చ్ టూల్స్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ డైరెక్టర్ డా. డి. హరికాంత్, కన్వీనర్ డా. బి. రజని దేవి, సహ-కన్వీనర్లు జె. స్వప్న, కె. తిరుపతి, బి. నరేష్, బి. పరశురాములు, వైస్ ప్రిన్సిపల్ అఫ్సరీ ఉస్మాని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కంట్రోలర్ సతీష్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్లు నల్ల మనోజ్ కుమార్, సి.హెచ్. విద్య, వాణిజ్య విభాగ అధ్యాపకులు సుధామ, సతీష్, అనూష, కృష్ణవేణి, సృజనతో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించండి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు వచ్చే వారం నుంచి గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, భూగర్భజల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ, కూరగాయలు, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని, పంటల సాగు, ప్రత్యామ్నాయ చర్యల వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో వర్షపాతం, నేల స్వభావం, భూగర్భ జలాలు, రైతుల వివరాలు పూర్తి నివేదికలతో సమావేశానికి రావాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎంతమంది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపారో నమోదు చేయాలని, కూరగాయల సాగును పెంచాలని హార్టికల్చర్ అధికారులను కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను రైతులకు వివరించి, పండ్ల మొక్కల సాగును పెంచాలని సూచించారు. నీటిపారుదల, పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ సభల్లో సాంప్రదాయ పంటల వివరాలను నమోదు చేసి, నీరు లేకుంటే సాగు చేయగల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవనాధికారులు, భూగర్భ జల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు చివరి అవకాశం




**హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు చివరి అవకాశం లభించింది. 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్--2026) ద్వారా నిర్వహిస్తున్న స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్లు జూలై 20 నుంచి 26 వరకు కొనసాగనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఈ కళాశాలలో బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఫిజికల్ సైన్స్ (మ్యాథమెటిక్స్--ఫిజిక్స్--కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ లైఫ్ సైన్స్ (బోటనీ--జువాలజీ--కెమిస్ట్రీ), బీఏ (ఎకనామిక్స్--హిస్టరీ--పొలిటికల్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, విశాలమైన గ్రంథాలయం, క్రీడా మైదానం, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు వంటి సౌకర్యాలు ఉన్నాయని, అర్హులైన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థులు తమ ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి వెబ్ ఆప్షన్లలో హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రాంగణాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

## బ్లూ బెల్స్ హై స్కూల్‌లో ఘనంగా గోరింటాకు వేడుకలు



**కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ హై స్కూల్‌లో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో సాంప్రదాయ విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని చేతులకు గోరింటాకు అలంకరించుకున్నారు. గోరింటాకు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల కరెస్పాండెంట్ జంగా సునీతా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమాలను పాఠశాలలో నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని
ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్థానిక సంఘ భవనంలో తెలంగాణ ఎన్జీవోల సంఘం సమావేశం

కరీంనగర్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం స్థానిక సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఉద్యోగుల సంక్షేమం, పెండింగ్ సమస్యలు, ప్రభుత్వ చర్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా, హెల్త్ కార్డులు అందుబాటులోకి తీసుకురావడం పట్ల సంఘం ధన్యవాదాలు తెలిపింది. హెల్త్ కార్డు అమలులో మరింత మెరుగుదల అవసరమని, ఔట్‌పేషెంట్ సేవలు, బ్రాండెడ్ మందులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన నాయకులను ఘనంగా సన్మానించారు. పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ వంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే దశలవారీగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో ఎన్జీవోల సంఘం ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. "ఉద్యోగుల గొంతుక" పత్రిక బలోపేతం కోసం సభ్యత్వ నమోదు తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేసిన రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌కు సమావేశం ఏకగ్రీవంగా ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సంగెం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, ఇరుమల్ల శారద, మారుపాక రాజేష్ భరద్వాజ్, పోలు కిషన్, కామ సతీష్, గంగారపు రమేష్, ఒంటెల ప్రసాద్ రెడ్డి, భీం రావ్, నగేష్ గౌడ్, శంకర్ యాదవ్, సుధాకర్ రెడ్డి, కయ్యం శ్రీనివాస్, దోంత రాజు, సునీత, శైలజ, సుస్మిత, విజయలక్ష్మి, కరుణ, అస్గర్ అలీ, లవకుమార్, శంషుద్దీన్, బల్బీర్ సింగ్, కమలాకర్, కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, కోట రామస్వామి, శంకర్, మొర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# అసంపూర్తిగా పెండింగ్‌లో ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని బీజేపీ రాస్తారోకో

పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జూలపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ ఏరియాలో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా చేపట్టారు. జూలపల్లి అభివృద్ధిని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, పెద్దపల్లి ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ బీజేపీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, మూడు సార్లు ఎమ్మెల్యేలు మారినా జూలపల్లి ప్రజల సమస్యలు మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా నివాస గృహాల ముందు నిర్మాణాలను కూల్చి ఏడాది గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పోలీస్ స్టేషన్ చౌరస్తా, జూపిటర్ స్కూల్ ముందు పన్నెండేళ్లుగా శిథిలమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీజేపీ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తరువాత పోలీసులు చేరుకొని ఆందోళనకారులను నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు మల్లెత్తుల అంజి యాదవ్ ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాటకుల అనిల్, బీజేవైఎం నాయకులు నాగుల అన్వేష్, పొన్నం సంతోష్, ఐల నరేష్, మాటూరి జితేందర్, బీజేపీ సీనియర్ నాయకులు కొమ్మ ఐలయ్య, కనపర్తి రాజేందర్, కంచి శ్రీనివాస్, బెజ్జంకి రమేష్, పెద్దల్ల ఐలయ్య, దొడ్ల రాజయ్య, కైలాసం వీరయ్య, గుంటి అశోక్, వైద్య లక్ష్మణ్, మేరుగు కనకయ్య, చిలువేరి శివ, చొప్పరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి పిలుపు తెల్లవారేసరికి పండంటి బిడ్డ జననం

ఆత్మకూరు, జూలై 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్): అత్యవసర సమయాల్లో స్పందిస్తూ, విధి నిర్వహణలోనే కాకుండా విధులకు మించి రోగుల ప్రాణాలకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మకూరు (ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రమ్య మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఒక గర్భిణీ స్త్రీ బంధువుల నుండి అర్ధరాత్రి 2 గంటలకు ఫోన్ కాల్ రావడంతో, పరిస్థితిని అర్థం చేసుకున్న ఆమె వెంటనే స్పందించారు. ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసి, పేషెంట్ చేరుకునే లోపే డెలివరీకి కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సకాలంలో వైద్యురాలు, సిబ్బంది స్పందించడంతో తెల్లవారుజామున 5:15 గంటలకు ఆ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ ప్రసవ ప్రక్రియలో నర్సింగ్ ఆఫీసర్ మానస, ఏఎన్ఎంలు లక్ష్మి, సుజాత, ఆశా కార్యకర్త సుజాతలు పాల్గొని విజయవంతం చేశారు. అర్ధరాత్రి వేళలో కూడా రోగుల పిలుపునకు స్పందించి, అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రమ్యను, ఆమె బృందాన్ని స్థానిక ప్రజలు, రోగుల బంధువులు ప్రశంసలతో అభినందిస్తున్నారు.



# నల్గొండలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ నెట్‌వర్క్ భగ్నం

నల్గొండ, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వ్యవస్థీకృత ఆస్తి నేరాలలోకి యువకులను రిక్రూట్ చేసి వారికి శిక్షణ ఇస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు సూత్రధారిగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు ఛేదించారు. శ్రీకాంత్ విచారణలో లభించిన సమాచారం ఆధారంగా పోలీసులు ముఠాలోని ఆరుగురిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ ముఠాకు తెలంగాణలో 28, ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసులు కలిపి మొత్తం 40 గృహ దొంగతనాల సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కేజీల వెండి ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదు, రెండు టెలివిజన్లు, రెండు సౌండ్‌బార్లు, ఐదు మోటార్‌సైకిళ్లు, ఏడు మొబైల్ ఫోన్లు సహా రూ.53 లక్షల విలువైన దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రకారం, నిందితులు నిరుద్యోగ యువకులను డబ్బు, మద్యం ఆశ చూపి ప్రలోభపెట్టి, వారికి దొంగతనం పద్ధతులు, లక్ష్య ఎంపిక, సీసీటీవీ నిఘాను తప్పించుకోవడం, దొంగిలించిన ఆస్తిని పారవేయడం వంటి విషయాలలో శిక్షణ ఇచ్చారని వెల్లడించారు. పలు నేర స్థలాల నుండి సేకరించిన వేలిముద్రలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, డి. చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ ఇన్స్పెక్టర్ పి.ఎన్.డి. ప్రసాద్, నిడుమనూర్ ఎస్ఐ విజయకుమార్, సీసీఎస్ ఎస్ఐ యు. సురేశ్, అలాగే సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధనగిరి, పుష్పగిరి, నాగరాజు, వహీద్ పాషా, ఫయాజ్, పీసీలు శివరాజ్, నరేష్, గులాందస్తగిరి, కమల్ కిశోర్, సాయి, జునైద్, నాగరాణి ఆశ్రర్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రకటించారు.




# మంత్రి కోమటిరెడ్డి ఇల్లు ముట్టడించిన ఐకెపి వివోఏలు

నల్లగొండ, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 18 వేల వేతన హామీతో పాటు ఇతర వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఐకెపి వివోఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ ఆఫీసును ముట్టడించారు. ఈ సందర్భంగా ఎండి సలీం మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 18 వేల కనీస వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అమలు చేయలేదు. చాలీచాలని వేతనాలతో వివోఏలు అర్థాకలతో పనిచేయాల్సి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వివోఏలకు సంబంధంలేని బుధవారం రివ్యూ మీటింగ్స్, ఉల్లాస్ యాప్‌లో పని, ఆన్లైన్ పనులను ఆపాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు, టాప్స్ నెట్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం సాధించిన చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి దోపిడీకి అవకాశం కల్పించింది. వెంటనే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ కోడ్స్ అమలు చేయబోమని ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య, పి. సులోచన మాట్లాడుతూ, "వివోఏల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 27న కలెక్టరేట్ ముట్టడి అనంతరం సమరశీల పోరాటాలకు సిద్ధమవుతాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు, జిల్లా నాయకులు పోలె సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. వెంకన్న, యూనియన్ నాయకులు కె. రేణుక, బి. సురేష్, కే. చంద్రకళ, రాందాస్, వై. పాపయ్య, వల్లెపు రాజేశ్వరి, జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ, జటావత్ సరోజ, బుర్రి రేణుక, పద్మ, ఆర్.బి. నాయక్, ధనలక్ష్మి, సుజాత, రాజు, సైదులు, సైదమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటు చేయాలి - ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల




పెద్దపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలోని అన్ని కోర్టుల్లో చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 20 కేసులు విచారణకు వచ్చి, రూ.67,57,420కు గాను రూ.45,60,420 రాజీ మార్గంలో పరిష్కరించబడ్డాయి. గోదావరిఖని కోర్టులో 8, సుల్తానాబాద్ కోర్టులో 5, నంది మేడారం కోర్టులో 1, మంథని కోర్టులో 3, పెద్దపల్లి కోర్టులో 3 కేసులు పరిష్కరించబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించడం ద్వారా బాధితులకు న్యాయం జరిగిందని అధికారులు తెలిపారు.

# మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.100 కోట్లు నిధులు మంజూరు



అమ్రాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నల్లమల్లలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు, సేవాలాల్ దేవస్థానం అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు విడుదలయ్యాయి. గిరిజన సోదరుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ భవ్య మందిర నిర్మాణానికి ఈ నిధులు ఎంతో దోహదపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో మద్దిమడుగు క్షేత్రం మరింత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో చందు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎల్మపల్లి మినీ గురుకులంలో సమస్యకు తక్షణ పరిష్కారం



అమ్రాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమ్రాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్మపల్లి మినీ గురుకులంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే పరిష్కరించారు. గురుకులాన్ని సందర్శించిన అధికారులు విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకోగా, లెట్రిన్ నుండి మురికి బయటకు పోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సెప్టిక్ ట్యాంక్ సిబ్బందిని పిలిపించి మురికిని తొలగించేలా ఆదేశించారు. తక్షణ చర్యతో సమస్య పరిష్కారమవడంతో విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమమే తమ లక్ష్యమని, గురుకులాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని అధికారులు తెలిపారు.

# ఘనంగా గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



దేవరకొండ, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యుడు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "జగదీష్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధిలో ఆయన విశేష కృషి చేశారని, రెండు మెడికల్ కళాశాలలు మంజూరయ్యేలా చొరవ చూపారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు బీఆర్ఎస్ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తూ, జిల్లాలో ప్రతిపక్ష పార్టీల బలమైన కోటలను కూడా బీటలు వార్చిన నాయకుడు జగదీష్ రెడ్డి అని ఆయన కొనియాడారు. జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## మర్రిగూడలో "పోలీస్ అక్క" కార్యక్రమం



మర్రిగూడ, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నల్లగొండ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "పోలీస్ అక్క" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సోషల్ మీడియా పరిమితులు, చిన్న వయసులో ఆకర్షణలకు లోను కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టినట్లయితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో "పోలీస్ అక్క"గా మర్రిగూడ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ శిరీషను నియమించారు. మండలంలోని ప్రతి పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మహిళ ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ విజేతను అభినందించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్ జూలై 18.(నీలగిరి ఎక్స్ ప్రెస్). :చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4ఐ400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన టీజీఎస్ డబ ల్యూ ఆర్ ఐ ఎస్ ఆధ్వర్యంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన నారిమళ్ల ప్రవళి కను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉన్నతాధికారులతో కలిసి ప్రవళిక ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఫ్లై ఓవర్ ప్రారంభం కోసం రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫ్లై ఓవర్‌ను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శనివారం భారీ సంఖ్యలో కార్యకర్తలతో మర్రిగూడ బైపాస్ రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు రోడ్డుపై బైఠాయించిన వారిని అరెస్టు చేసి దేవరకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.దేవరకొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ తన అనుచరులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.అరెస్టయిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, కార్పొరేటర్లు దొడ్డి రమేష్, దీపా నాయక్, గోపగోని స్వాతి రాజశేఖర్, గుండ్రెడ్డి యుగంధర్ రెడ్డి, పెండం ధనుంజయ్, మెండు చంద్రశేఖర్ రెడ్డి, అనిల్ నాయక్, చెనగోని నాగరాజు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ విప్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విండో చైర్మెన్, పాలకవర్గం



ఎలిగేడు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండల కేంద్రంలోని పీఏసీఎస్ చైర్మన్‌గా సామ రాజేశ్వర్ రెడ్డి నియామకమయ్యారు. ఆయనతో పాటు సభ్యులుగా అమ్ముల రమేశ్, శెరిశెట్టి శ్రీధర్, నరహరి మోహన్ రెడ్డి, గోదల వెంకట్రెడ్డి, తానిపర్తి వెంకటేశ్వరరావు, రామిడి సరోజన, కొత్తిరెడ్డి సంధ్య, అమ్ముల రాజు, మంద లక్ష్మన్, ముంజం ముత్యాలు, ముంజం కళావతి, కుర్ర పోచాల నియమితులయ్యారు.శనివారం వీరంతా ఎలిగేడు మండలంలోని శివపల్లిలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ నియామకానికి కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదే రోజు కనుకుల సింగిల్ విండో చైర్మన్‌గా చిలుక సతీష్ నియామకమయ్యారు. ఆయనతో పాటు పాలకవర్గ సభ్యులు కూడా శివపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో విజయరమణారావును కలసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి.. ప్రకృతిని పరిరక్షించాలి

**- వనమహోత్సవంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు, ఎంఈవో పాండు పిలుపు**



ఆమనగల్లు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మొక్కలు మానవ జీవితానికి ప్రాణాధారమని, అవి ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు, మండల విద్యాధికారి (ఎంఈవో) పాండు అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని అరబిందో ప్లే స్కూల్ ఆవరణలో పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ రెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ ప్రేమకుమారి, ప్రిన్సిపల్ నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చిన్నారులకు మొక్కల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. అనంతరం నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని ప్రతిజ్ఞ చేయించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడమే భవిష్యత్ తరాలకు మనం అందించే గొప్ప కానుక అని పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు భాస్కర్, నరేష్, నజీర్, రతీష్, శ్రీను, శేఖర్, రఘు, సునీత, రాధా, సౌజన్య, సౌమ్య, యామిని, శైలజ, ప్రేమలత, సంధ్య, నహేదతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



ఎలిగేడు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ప్రస్తుత వానాకాలంలో వర్షాభావం తక్కువగా ఉండటంతో ఎల్నినో ప్రభావం కారణంగా రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల ఏఈవో సురేశ్ సూచించారు.ఎలిగేడు మండలం రాములపల్లిలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, “ఆరుతడి పంటలను సాగు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది” అని వివరించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ, “జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, ప్రతి పంట పొలానికి పంటకుంట, ప్రతి ఊరికి పూటకుంట నిర్మించి నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత” అని సూచించారు.

# ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్య బలోపేతం

**- తల్లోజు ఆచారి**
**- ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడు భాగస్వామి కావాలి**



ఆమనగల్లు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, చంద్రయన్‌పల్లి తండా, ముర్తుజపల్లి, జంగారెడ్డిపల్లి, సాకిబండ, నుచ్చుగుట్ట తండా వార్డుల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి అవసరమైన పత్రాలను బీఎల్‌వోలకు అందజేసి సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఈసీఐఎన్ఈటీ యాప్ ద్వారా 2002 ఓటరు జాబితాతో పాటు ఓటరు వివరాలను సులభంగా పరిశీలించవచ్చని అవగాహన కల్పించారు. సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఏ-2ల సేవలను తల్లోజు ఆచారి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, కౌన్సిలర్ దోలి మల్లయ్య నాయక్, మాజీ కౌన్సిలర్ కృష్ణ నాయక్, కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ నేనావత్ రవి రాథోడ్, జగన్ రెడ్డి, పాపయ్య, ముత్యాలు, నరేందర్ రాథోడ్, సందీప్, సుమన్, రమేష్, పాండతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తే ఉపేక్షే లేదు

**- ఎరువుల అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు**
**- వ్యవసాయ సహాయ సంచాలకులు శోభారాణి**



ఆమనగల్లు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రైతుల పేరుతో ఎరువుల అక్రమ విక్రయాలు, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరిపే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కె. శోభారాణి హెచ్చరించారు. శనివారం ఆమనగల్ రైతు వేదికలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియా, ఇతర ఎరువులను తప్పనిసరిగా ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని, ప్రతి విక్రయానికి బిల్లు ఇవ్వడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం సిఫారసు చేసిన ఏడు రకాల సన్న వడ్ల విత్తనాల విక్రయ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు రైతులకు బిల్లులు అందజేయాలని ఆదేశించారు. రైతుల పేరుతో అక్రమాలకు పాల్పడినా, ఎంఆర్పీకి మించి ధరలు వసూలు చేసినా, నిబంధనలను ఉల్లంఘించినా లైసెన్స్ రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ సూచనలను కచ్చితంగా అమలు చేసి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. సమావేశంలో ఆమనగల్ వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్, మాడ్గుల వ్యవసాయ అధికారి అరుణ కుమారి, తలకొండపల్లి వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని, కడ్తాల్ వ్యవసాయ అధికారి కవితతో పాటు ఆమనగల్ డివిజన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు భోధన మెలకువలు పెంపొందించుకోవాలి



ఎలిగేడు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నిరంతరంగా కొత్త భోధనా మెలకువలు అలవర్చుకుని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగు పరచాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పిఎమ్ షేక్ సూచించారు.ఎలిగేడు కాంప్లెక్స్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ (ఫిజికల్ సైన్స్) కార్యక్రమానికి మూడవ రోజు శనివారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, గత రెండు రోజులుగా ఉపాధ్యాయులకు అందించిన శిక్షణా అంశాలను, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, “గత విద్యా సంవత్సరంలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడంలో ఉపాధ్యాయుల కృషి కీలకం. ఈ శిక్షణలో నేర్చుకున్న సరికొత్త భోధనా పద్ధతులను క్షేత్రస్థాయిలో అమలు చేస్తేనే విద్యార్థుల ప్రతిభ మరింత వెలుగులోకి వస్తుంది” అని అభినందించారు.ప్రభుత్వం ఉపాధ్యాయుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకే ఇలాంటి శిక్షణ తరగతులను నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి, కాంప్లెక్స్ హెచ్ఎం గంధ్ర దేవేందర్ రావు, డిఆర్పీలు సురేందర్, శ్రీనివాస్, జగదీశ్వర్ రెడ్డి, వంశీకృష్ణతో పాటు ఎలిగేడు, ధర్మారం, సుల్తానాబాద్, జూలపల్లి మండలాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బొలెరో బోల్తా కూలీలకు తీవ్ర గాయాలు





నందికొట్కూరు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నందికొట్కూరు మండల పరిధిలోని శాతన కోట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి కె.సి. కెనాల్‌లో బోల్తా పడింది.అల్లూరు గ్రామానికి చెందిన ఏపీ21టీబీ1463 నంబర్ వాహనంలో అదే గ్రామానికి చెందిన 15 మంది కూలీలు పనికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ఈ ఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, మిగతా కూలీలకు కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అనంతరం గాయపడిన కూలీల పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంటి కల సాకారం



తలకొండపల్లి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శనివారం ప్రారంభించి, ముగ్గురు లబ్ధిదారుల నూతన గృహాల్లో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను కల్పించి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నరసింహ, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, చౌదర్‌పల్లి సర్పంచ్ మెరిగే భారతమ్మ--గోపాల్, ఉపసర్పంచ్ తడిసిన జ్యోతి--ప్రదీప్ రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, చర్ల వెంకట్ రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, నాయకులు రఘురాములు, కాకి కృష్ణ, రవికిరణ్ రెడ్డి, రమేష్, యాదయ్య, చెన్నకేశవులు, రాజేందర్, మండల మైనార్టీ నాయకులు అజీజ్, ఆరిఫ్, మల్లేష్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.5.10 కోట్ల అభివృద్ధి పనులకు నేడు ఎమ్మెల్యే కసిరెడ్డి శ్రీకారం



ఆమనగల్లు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం మాడుగుల మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం రూ.5.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేస్తూ ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు,
అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్
మీడియా ప్రతినిధులు అధిక
సంఖ్యలో పాల్గొని విజయవంతం
చేయాలని
నిర్వాహకులు కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా విద్యా ప్రగతిని చూడండి

**- విద్యా నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ జూలై18 :**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం,విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడం విద్యా నాణ్యతను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ప్రతి విద్యాశాఖ అధికారి,ప్రతి ఉపాధ్యా యుడి ప్రధాన బాధ్యత అని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే ముందుగా విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు.శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల విద్యాధి కారులు (ఎంఈఓలు),స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల (కేజీబీవీ) ప్రత్యేక అధికారులు,జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ విద్యార్థుల నమోదు,ప్రీ-ప్రైమరీ ప్రవేశాలు,ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత,ఉపాధ్యాయుల హాజరు,పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు,పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు,మధ్యాహ్న భోజన పథకం,కేజీబీవీల నిర్వహణ,పాఠశాలల్లో మౌలిక వసతులు తదితర అంశాలపై పాఠశాలల వారీగా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ "కారణాలు చెప్పడం కాదు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా విద్యా ప్రగతిని చూడండి. ప్రతి విద్యార్థి ఎంత నేర్చుకుంటున్నాడు ఎంత అభివృద్ధి చెందుతున్నాడు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు ఎంత నమ్మకం పెరుగుతోంది అనేదే మన పనితీరుకు కొలమానం కావాలి అని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపులో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు, మండల విద్యాధికారులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించారని కలెక్టర్ అభినందించారు.జిల్లాలో విద్యార్థుల నమోదు పెరగడానికి కృషి చేసిన ప్రతి ఉపాధ్యాయుడికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలపాలని కోరారు.అయితే కొన్ని మండలాల్లో ప్రీ-ప్రైమరీ తరగతుల్లో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలిక ప్రభుత్వ పాఠశాలలో నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

ప్రతి పాఠశాల పరిధిలోని గ్రామానికి సంబంధించిన వివరాలను సేకరించి ఒక్కో విద్యార్థి బాధ్యతను ఒక్కో ఉపాధ్యాయుడికి అప్పగించాలని సూచించారు.ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు మనం ఉన్నత స్థానాల్లో ఉండడానికి ప్రధాన కారణం,ప్రభుత్వ పాఠశాలలే పునాది. మనమందరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఎదిగాం.మన కుటుంబాలు,మన పిల్లలు మంచి స్థాయిలో ఉండడానికి ఆ పాఠశాలలే కారణం.ఇప్పుడు అదే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిది.విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచి ప్రభుత్వ పాఠశాలలను ప్రజల తొలి ఎంపికగా నిలబెట్టాలి అని కలెక్టర్ అన్నారు.తనకు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలనే ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టం చేసిన కలెక్టర్,విధుల్లో నిర్లక్ష్యం మాత్రం సహించబోమని హెచ్చరించారు.శుక్రవారం కల్వకుర్తిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండడం మధ్యాహ్న భోజనం తయారుచేసే ప్రదేశం అధ్వాన్నంగా ఉండడం పిల్లల తరగతి గది కూలేస్థితిలో ఉండడం మంచి తరగతి గదిని స్టాఫ్ రూమ్ గా మార్చి తాళం వేయడం,ప్రధానోపాధ్యాయుడు గైర్హాజరు కావడం, ఐదుగురు ఉపాధ్యాయుల్లో ఇద్దరు మాత్రమే విద్యార్థులకు బోధన నిర్వహించడం వంటి పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన తర్వాతే సంబంధిత ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాల్సి వచ్చిందని జిల్లా కలెక్టరి సందర్భంగా వివరించారు.

అది వ్యక్తిగత చర్య కాదని విద్యార్థుల ప్రయోజనాల కోసమే తీసుకున్న పరిపాలనా నిర్ణయమని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలోని ఎంఈఓలు,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు,ఎస్జీటీలు,ఇతర ఉపాధ్యాయులు ఎవరైనా అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. అయితే నిబంధనల ప్రకారం లభించే సెలవులను వినియోగించుకోవడంపై ఎలాంటి అభ్యంతరం లేదని అత్యవసర పరిస్థితుల్లో వాట్సాప్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం అందించి సెలవు పొందవచ్చని చెప్పారు.కానీ పాఠశాలకు వచ్చి హాజరు నమోదు చేసి విధి సమయం ముగియకముందే వెళ్లిపోవడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులు ప్రతిరోజూ సమయపాలన పాటించాలని విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరుతో పాటు ఉపాధ్యాయుల హాజరు కూడా కచ్చితంగా నమోదు కావాలని ఆదేశించారు.మండల విద్యాధికారులు,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించి బోధన,హాజరు,పరిశుభ్రత,విద్యార్థుల అభ్యాస స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేకంగా చర్చించిన కలెక్టర్,విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం ప్రధానోపాధ్యాయుల ప్రత్యక్ష బాధ్యత అని స్పష్టం చేశారు.మెనూలో ఉన్న ప్రతి ఆహార పదార్థం విద్యార్థులకు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎక్కడైనా మధ్యాహ్న భోజన నిర్వహణ సంస్థలు సరిగా పనిచేయకపోతే వెంటనే నివేదికలు సమర్పించాలని అవసరమైతే వారిని తక్షణమే మార్చివేస్తామని హెచ్చరించారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.తరగతి గదులు,వం టశాలలు, మరుగుదొడ్లు,తాగునీటి సౌకర్యాలు,పాఠశాల ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు.ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల్లో సాధ్యమైనంత వరకు ఇంగ్లీష్ భాషలోనే బోధన సంభాషణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

కేజీబీవీల నిర్వహణపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు .కొన్ని కేజీబీవీల్లో పరిపాలనలో లోపాలు ఉన్నాయని వాటిని వెంటనే సరిచేయాలని ప్రత్యేక అధికారులను హెచ్చరించారు.కేజీబీవీలు బాలికల భద్రత,విద్య,వ్యక్తిత్వ వికాసానికి ఆదర్శ కేంద్రాలుగా ఉండాలని విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం జరిగే రోజుల్లో మాత్రమే ప్రజాప్రతినిధులు,విలేకరులను కేజీబీవీల్లోకి అనుమతించాలని మిగిలిన రోజుల్లో బాలికల భద్రతా కారణాల దృష్ట్యా ఎవరినీ అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.కేజీబీవీలో పనిచేసే ఉపాధ్యాయులు సిబ్బంది ప్రత్యేక అధికారి ఎవరైనా వ్యవస్థను ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించినా క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించినా అలాంటి సంఘటనలను విద్యార్థులకు ప్రోత్సహించినా సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు,సిబ్బందిపై ఉద్యోగాల నుంచి తొలగింపు వరకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఈ సమీక్ష సందర్భంగా వెల్దండ మండలం బొల్లంపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఐదేళ్ల సంవత్సరాల చిన్నారులు ప్రీ-ప్రైమరీ ప్రవేశాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి కారణాలను అడిగి తెలుసుకున్నారు.అదే సమయంలో తెలకపల్లి మండలం కార్వంగా,ఊర్కొండ మండలం ఊర్కొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచిన విధానాన్ని అడిగి తెలుసుకుని ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.ఇతర మండలాలు కూడా వాటిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని ఎక్కడ లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని వనరులు అందిస్తోందని వాటిని సమర్థంగా వినియోగించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి విద్యాధికారి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యకు చిరునామాగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం,జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ ,డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్,సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్,నూరుద్దీన్,టెక్ట్స్ బుక్ మేనేజర్ నరసిం హులు, విద్యాశాఖ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

**- గ్రామాభివృద్ధిలో శాఖల సమన్వయం కీలకం**
**- పనుల్లో జాప్యానికి తావు లేకుండా నాణ్యతతో వేగవంతంగా పనులు పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ జూలై18 :**శనివారం జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి చాంబర్‌లో అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి కొండారెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం,జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్య,వైద్యం,మౌలిక సదుపాయాలు,గృహ నిర్మాణాలు,రహదారులు,పారిశుద్ధ్యం,పచ్చదనం వంటి అనేక రంగాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అందుకు అనుగుణంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పని ప్రజల అవస రాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజాధనం ఎంతో విలువైనదని ఆ నిధులతో నిర్మిస్తున్న భవనాలు,రహదారులు,ఇతర మౌలిక సదుపాయాలు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం,జాప్యం లేదా నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు.గ్రామంలో కొనసాగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి నిర్దిష్ట గడువులు ఉన్నాయని ఆ గడువులను తప్పనిసరిగా పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా పరస్పర సహకారంతో పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు.ఏదైనా సాంకేతిక,పరిపాలనా లేదా ఇతర సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.అదే విధంగా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన,రహదారుల అభివృద్ధి,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు,గ్రామ సుందరీకరణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసి గ్రామ ప్రజలకు మరింత మెరుగైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు.పచ్చదనం పెంపొందించడం,పర్యావరణ పరిరక్షణ,పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం వంటి అంశాల్లో కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.ప్రతి శాఖ తనకు అప్పగించిన పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా కొండారెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా నిలపాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఈవో సీఈవో గోపాల్ నాయక్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను దేశంలోని అత్యుత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**- పాఠశాలలో విద్యార్థుల నాట్య ప్రదర్శనలు**
**- విద్యార్థినిలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే**
**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**



**ఆమనగల్లు జూలై 18 :**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను డిజిటల్ తరగతుల బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుం టోంది.ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు ప్రీ-ప్రైమరీ తరగతులు డిజిటల్ బోధన పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణ రెడ్డి అన్నారు.శనివారము ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని కస్తూరి గాంధీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పం పిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ మార్కెట్ చైర్మన్ యట గీత మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి మండల విద్యాధికారి పాండు టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి విద్యార్థినిలకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాటా డుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని విద్యార్థినీలు ఏకాగ్రతతో ముందుకు సాగి ఉన్నత పౌరులుగా ఎదగాలని ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య డిజిటల్ బోధన దేశంలో ఉన్నతంగా రాణించిన వారంతా ప్రభుత్వం పాఠశాలలోనే చదివిన వారేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, కాంగ్రెస్ శ్రేణులు విద్యార్థినిలు పాఠశాల బృందం, లు ఉన్నారు.

# బిఆర్ఎస్ రాజకీయ ఆత్మరక్షణ ప్రయత్నమే యువ సంగ్రామ సభ - బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి



**కల్వకుర్తి, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని సరూ ర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ యువత భవిష్యత్తుపై చర్చించే వేదికగా కాకుండా, తమ గత పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే రాజకీయ కార్యక్రమంగా మారిందని విమర్శించారు .తెలంగాణ యువతకు కావాల్సింది మాటలు కాదు, అవకాశాలు, ఉద్యోగాలు, పారదర్శక పాలన అని ఆయన స్పష్టం చేశారు. "గతాన్ని మరిపించే ప్రయత్నాల కంటే, చేసిన తప్పులకు ప్రజలకు సమాధానం చెప్పే ధైర్యం చూపించాలి" అని అన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను మోసం చేసిన గులాబీ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత లభించిందని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే తమ రెండున్నరేళ్ల పాలనలో ఉద్యోగాల భర్తీ, పాలనా పారదర్శకత, యువత సంక్షేమానికి మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు."యువతను నినాదాలతో కాదు, నిజాయితీతో, అభివృద్ధితో ప్రజల మనసు గెలుచుకోవాలి" అని కాయితి విజయకుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదం గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**రామడుగు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**కొరటపల్లి గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి (30),శుక్రవారం మధ్యాహ్నం కూలిపని ముగించుకుని తిరిగి పనికి వెళుతుండగా ఘోర ప్రమాదానికి గురయ్యాడు.కొరటపల్లి--షానగర్ మధ్యలోని కోళ్ల ఫారం వద్ద మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుపతి నడుపుతున్న ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చిన వోల్క్స్‌వేగన్ పోలో కారును అతివేగంగా నడిపిన కొరటపల్లి గ్రామానికి చెందిన మేకల ప్రభాకర్ యాదవ్ ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో తిరుపతి ఎగిరి పడిపోవడంతో తలకు తీవ్ర రక్తగాయం అయ్యింది. స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న తిరుపతి శనివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబసభ్యులఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లాలపల్లెలో ప్రత్యేక ఓటర్ సవరణ



**ఎలిగేడు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని లాలపల్లె గ్రామంలో శనివారం ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి గ్రామ ప్రజలకు ఎస్ఐఆర్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన ఆయుధం. అందరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఎల్ఓ వసంతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**ఎలిగేడు, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ధూళికట్ట ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ ఆఫ్ యన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్, పాఠశాల పూర్వ హెచ్ఎం పోలు సత్యనారాయణ విద్యార్థులకు కంపాక్స్ బాక్సులు, పెన్సిల్స్, ఎరేజర్లు, పెన్నులు, నోట్‌బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొమురయ్య మాట్లాడుతూ, "మానవసేవయే మాధవసేవ. సేవాభావంతో పాఠశాల విద్యార్థులకు సామాగ్రి అందించడం అభినందనీయమైన విషయం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు బిజిలి సదయ్య, మిట్టపల్లి యుగంధర్, ఉపాధ్యాయులు భల్లా చంద్రశేఖర్, గోపు వెంకట్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి...

**రాయపోల్ :**పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గ్రామాల్లో మొక్కలు నాటాలని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం బేగంపేట పోలీస్ స్టేషన్ లో 60 రకాల మొక్కలను పోలీస్ సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం పరిశుభ్రత కోసం గ్రామాల్లో చెట్లను పెంచాలని సూచించారు.. మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని దీంతో భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో యువకులు మహిళలు విద్యార్థులు ప్రజాప్రతినిధులు ప్రజలు ముందుకు వచ్చి వారి వారి ఇండ్ల ముందు మొక్కలు నాటే కార్యక్రమానికి ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తొగుట సీఐ షాఖ. లతీఫ్, గజ్వేల్ టౌన్ ఎస్ఐ రవి కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ , బేగంపేట ఎస్ఐ రేణుక , దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్. కుక్కునూరు పల్లి ఎస్సై బాలకృష్ణ ,తొగుట ఎస్సై నవీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

# ఫేర్‌వెల్ పార్టీ సంబరాలు

**తార్నాక :**న్యూ అంబిక టైప్‌రైటింగ్ ఒ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ శాంతినగర్, సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలోగత 60 సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న మా సంస్థ, ప్రతి పరీక్షలో కనీసం 3 నుంచి 6 స్టేట్ టాప్పర్లను అందిస్తూ తన గౌరవాన్ని నిలుపుతోంది.రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం కావడంతో, మా విద్యార్థులందరికీ హృదయపూర్వక ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేశాము. వారికి హాల్ టికెట్లు అందజేసి, పరీక్షల్లో ఉత్తమంగా రాయడానికి అవసరమైన మెలకువలు, సూచనలు చెప్పాము.

## రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

### ఆర్‌సీ 17 పట్టాలకెక్కనుందని ప్రచారం



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

## ప్రియాంక చోప్రా బర్త్‌డే

### విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

## ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

### ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా

## మరోమారు వార్తల్లో నటి నమిత

### స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## బేబీ బంప్‌తో రెబా మోనికా



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్ పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్



నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్టిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఓటిటిలోకి బాలన్..ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ - ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ - ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.